

ఉచిత బస్సు ఆరోగ్యమస్తు..!

- పెద్దాస్పత్రికి పెరిగిన ఓపీ
- సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న వైనం
- శుభపరిణామం అంటున్న వైద్యవర్గాలు

ఫ్రీ బస్సు ఎఫెక్ట్.. ఆరోగ్యంపై మహిళల శ్రద్ధ

పల్లెటూరి మహిళలు ఆరోగ్యం గురించి పట్టించుకునే పరిస్థితులు తక్కువ. ఇబ్బందిగా ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో నగరాలు, పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేకపోతుంటారు. జబ్బు ముదిరాక ఆస్పత్రులకు పరుగులు పెట్టినా.. డబ్బు వృథా తప్ప.. ప్రయోజనం ఉండకపోవచ్చు. జబ్బు ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకుని, చికిత్స తీసుకుంటే నయమయ్యే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం వారికి వరంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణంతో చాలామంది మహిళలు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే నగరాలు, పట్టణాలకు వెళ్తున్నారు. సొంత ఖర్చులు పెట్టుకుంటే చాలు. వారిపై రవాణా భారం తగ్గుతోంది. దీంతో పెద్దాస్పత్రులకు అధిక సంఖ్యలో వచ్చి, పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందుతున్నారు. స్త్రీ శక్తి ప్రవేశ పెట్టాక జిల్లా సర్వజనాస్పత్రికి మహిళా ఓపీ విపరీతంగా పెరగడమే ఇందుకు నిదర్శనం.



అనంతపురం వైద్యం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం పథకం.. వారి స్వీయ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా దోహదపడుతోంది. ఊర్లో బస్సు ఎక్కి అనంతపురంలో దిగి పెద్దాస్పత్రికి వస్తున్నారు. సొంత ఖర్చులు మినహా చార్జీల భారంలేదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెద్ద డాక్టర్లు ఉంటారనీ, అక్కడికెళ్లి డాక్టర్‌తో చూపించుకుంటే అన్నిరకాల పరీక్షలు చేస్తారు, ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా.. ప్రారంభ దశలోనే చూపించుకుంటే వాటి నుంచి బయటపడవచ్చని మహిళలు భావిస్తున్నారు. ఆ మేరకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇలా.. ఉచిత బస్సు పథకాన్ని ఆరోగ్య పరిరక్షణకు మహిళలు వినియోగిస్తుండడం హర్షణీయం.

సుదూర ప్రాంతాల నుంచి...

ఉచిత బస్సు ప్రయాణం అమలు కావడంతో ఉమ్మడి జిల్లాలోని సుదూర ప్రాంతాలనుంచి మహిళలు పెద్దాస్పత్రికి తరలివస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆసరా లేకుండా వైద్యసేవలు పొందేందుకు మహిళలే సొంతంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తుండటం విశేషం. ఇంటి అవసరాల కోసం తప్పని పరిస్థితుల్లో కుటుంబంలోని పురుషులే అనంతపురం వచ్చేవారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన రాయదుర్గం, కణేకల్లు, గుంతకల్లు, తాడిపత్రి, కదిరి, అమరాపురం ఇలా అన్ని మండలాల నుంచి మహిళలు వారి ఆరోగ్యం కోసం ఆస్పత్రికి వస్తుండటం శుభపరిణామమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. కర్నూలు, కడప జిల్లాల్లోని (మిగతా 6లో...)

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలవారీగా ఓపీ వివరాలు...

నెల	మొత్తం ఓపీ	మహిళా ఓపీ	శాతం
ఏప్రిల్	52,545	20,492	39
మే	49,575	20,325	41
జూన్	58,672	22,291	37
జూలై	61,965	25,045	40
ఆగస్టు	67,742	31,885	47
సెప్టెంబరు	74,967	38,982	52



కంటి చికిత్స విభాగంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రూ.500 చార్జీ మిగిలింది



నా కూతురు లలితమ్మ కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం అగ్రహారంలో ఉంటుంది. చెవిలోనొప్పి ఉందని బాధపడుతుంటే పెద్దాస్పత్రికి వచ్చాం. ఫ్రీ బస్సు కదా రానుపోను రూ.500 మిగులుతుంది. ఇక్కడైతే పెద్ద డాక్టర్లు ఉంటారని వచ్చాం. పరీక్షలు చేసి, మందులిస్తే వెళ్లిపోదామనుకున్నాం. పరీక్షలు చేసిన వైద్యులు ఆపరేషన్ అవసరమని చెప్పారు. ఆ మేరకు ఆపరేషన్ చేయించుకుని, వెళ్తాం.

-రామాంజినమ్మ, పెంచలపాడు, గుంతకల్లు మండలం

5,116 రుద్రాక్షలతో అలంకరణ

తాడిపత్రి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా బుగ్గరామలింగేశ్వరస్వామిని గురువారం రుద్రాక్షలతో అలంకరించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 5116 రుద్రాక్షలతో స్వామివారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



రుద్రాక్షల అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరస్వామి

కుంభాభిషేకానికి రండి..!

మంత్రి 'ఆనం'కు కసాపురం ఆలయ ఆహ్వాన పత్రిక



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న కసాపురం దేవస్థాన ఈఓ విజయరాజు

గుంతకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కసాపురం దేవస్థాన ఈఓ విజయరాజు కుంభాభిషేక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 31న కసాపురం దేవస్థానంలో గోపుర కలశ స్థాపన, కుంభాభిషేకాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం తాడేపల్లికి వెళ్లిన ఈఓ, ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి ఆనంకు కార్యక్రమం ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మంత్రిని శాలువాతో సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు రాఘవాచార్యులు, అధికారి నాగేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితులకు అండగా ఉంటాం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ చౌదరి



మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

అనంతపురం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో భూకబ్జా బాధితులకు అండగా ఉంటామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. రాం నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 28న జరగాల్సిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను కొన్ని కారణాలవల్ల వాయిదా వేస్తున్నామని తెలిపారు. నవంబరు లేదా డిసెంబరు చివరలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో సేవలందించిన వారికి ఎన్టీఆర్ అవార్డులను అందిస్తామని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలో భూకబ్జా బాధితులు, డబుల్ రిజిస్ట్రేషన్ బాధితులు వస్తే అండగా ఉంటామని అన్నారు. తన వద్దకు వచ్చిన బాధితులను జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా రిజిస్ట్రార్‌ను కలవాలని కూడా చెబుతున్నామని అన్నారు. అధికారుల నుంచి సరైన స్పందన లేకుంటే తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి, సీఎం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. తన వద్దకు ఇప్పటివరకూ ఏడెనిమిది కేసులు వచ్చాయని తెలిపారు. సీఎం చంద్రబాబు ఎవరినీ ఉపేక్షించరనే నమ్మకం తనకు ఉందని అన్నారు.

సురక్షపై అవగాహన కల్పించండి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సురక్ష యాప్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం ఆయన ఎక్సైజ్ అధికారులతో కలిసి ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో జే బ్రాండ్‌తో నకిలీ మద్యాన్ని రాష్ట్ర ప్రజలకు అంటగట్టి, అనారోగ్యానికి గురి చేశారని విమర్శించారు. సురక్ష యాప్ ద్వారా మద్యాన్ని సులువుగా అసలా లేకా నకిలీనా అనేది గుర్తించవచ్చన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. బీటీపీ కాలువ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తి చేసి 114 చెరువులకు నీళ్లు అందిస్తామన్నారు. తర్వాత అక్కడే జరిగిన మరో కార్యక్రమంలో 22 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన రూ.10.32 లక్షల చెక్కులను ఎమ్మెల్యే సురేంద్రబాబు అందచేశారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కళ్యాణదుర్గం మండలంలోని చాపిరి గ్రామానికి చెందిన రమేష్‌కు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చాపిరి గ్రామ నాయకులతో కలిసి బాధితుడికి ఆర్థిక సాయాన్ని అందచేశారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని బాధితుడికి ఎమ్మెల్యే సూచించారు.

ఎస్పీ కార్యాలయానికి జేసీపీఆర్

మీడియాతో మాట్లాడేందుకు విముఖత



ఎస్పీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ప్రభాకర్ రెడ్డి

అనంతపురం క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి గురువారం ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ జగదీష్‌ను కలిసేందుకు ఆయన కార్యాలయంలోకి వెళ్లారు. తాడిపత్రిలో ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి గురించి రెండు రోజుల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలపై ఎస్పీ స్పందించిన విషయం తెలిసిందే. ప్రభాకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ప్రకటించిన నేపథ్యంలో ఆయన నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. జేసీపీఆర్ వ్యాఖ్యలను అనంతపురంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం తప్పు పట్టడం, దీనికి ప్రతిగా తాడిపత్రిలో కొందరు టీడీపీ నాయకులు ఎదురుదాడి చేయడం తెలిసిందే. ఈ క్రమంలో డీఐజీ షిమోషి కూడా స్పందించారు. పోలీసుల మాటలకంటే చర్యలే బలంగా మాట్లాడుతాయని ఆమె ప్రకటించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొంటూ.. ప్రకటన విడుదల చేశారు. ఇన్ని వివాదాల నేపథ్యంలో ఎస్పీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత మీడియా ప్రతినిధులు ఆయనను కలిసేందుకు ప్రయత్నించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడేందుకు ప్రభాకర్ రెడ్డి విముఖత చూపారు. ఈ క్రమంలోనే యూ ట్యూబర్స్‌పై చిందులు తొక్కారు.

తుంగభద్రకు పెరిగిన వరద

నేడు క్రస్ట్ గేట్లు ఎత్తే అవకాశం



బళ్లారి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా తుంగభద్ర జలాశయంలోకి వరద పెరుగుతోంది. ఇన్ ఫ్లో గురువారం సాయంత్రం 14 వేల క్యూసెక్కులు ఉండగా, రాత్రికి 21,697 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో గరిష్ఠ నిల్వ నీటి నిల్వలు 80 టీఎంసీలకు చేరాయి. డ్యాం భద్రత దృష్ట్యా 80 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయొద్దని నిపుణులు సూచించిన నేపథ్యంలో గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో ఏ క్షణంలోనైనా డ్యాం గేట్లు తెరిచి నదికి నీరు వదిలే అవకాశం కనిపిస్తోంది. డ్యాం కింది భాగం, నదీ పరీవాహక ప్రాంతాల గ్రామాలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తుంగభద్ర అధికారులు గురువారం హెచ్చరికలు జారీ చేశారు.



అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వర్షపు నీటిలో ద్విచక్రవాహనదారుల ఇబ్బందులు



శ్రీకంఠం సర్కిల్ వద్ద వాహనదారుల అవస్థలు



కూడేరు మండలం కళ్లగళ్లలో గాలిమరపై పడిన పిడుగు



నీట మునిగిన జనశక్తి నగర్‌లోని ఎంజీఎం నివాసాలు

అనంతలో కుండపోత

గంటన్నరకుపైగా దంచికొట్టిన వాన

కళ్లగళ్లలో పిడుగుపాటుకు గాలిమర దగ్ధం

అనంతపురం అర్బన్/కూడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జల్లులకు పరిమితమై.. సాయంత్రం వరకూ తెరిపి ఇచ్చింది. ఆ తరువాత రాత్రి ఏడు గంటల సమయంలో మొదలైన భారీ వర్షం.. 8.30 వరకూ కొనసాగింది. ఉరుములు, మెరుపులతో నగరం దద్దరిల్లింది. ఆ తరువాత కూడా తేలికపాటి జడివాన కొనసాగింది. దీంతో దిచక్రవాహనదారులు, పాదచారులు గంటల తరబడి ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. పలు కాలనీలలో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శింగనమల, బెళుగుప్ప, నార్పలలో మోస్తరు వర్షం కురిసింది. పెద్దవడుగూరు, గార్లదిన్నె, పుట్లూరు, పామిడి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. కూడేరు మండలం కళ్లగళ్లలో పిడుగుపాటుకు గాలిమర దగ్ధమైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో బుధవారం వర్షం కురిసింది. అత్యధికంగా బ్రహ్మసముద్రంలో 6.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కళ్యాణదుర్గం 5.8, శెట్టూరు 4.7, గుమ్మఘట్ట 3.8, కంబదూరు 2.8, యాడికి, యల్లనూరు 2.4, గుత్తి 2.2, నార్పల, ఆత్మకూరు 1.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.1 సెంటీ మీటరులోపు వర్షపాతం నమోదైంది.



కాస్త తగ్గింది.. పోదాం పద ఇంటికి.

అయ్యో.. గోపాల..!

- 25 ఏళ్లుగా గోపాలమిత్రలకు పెరగని వేతనం
- ఏ నెలా సక్రమంగా అందని పరిస్థితి
- పశుసంవర్ధక సహాయకులు చేసే పని చేసినా ప్రయోజనం ఏదీ





మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోపాల మిత్రలు (ఫైల్)

అనంతపురం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో చేరి 25 ఏళ్లు గడిచినా పైసా పెంపులేని జీతంతో పని చేస్తున్నామని గోపాలమిత్రలు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలు వినే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు పదో తరగతి విద్యార్హతతో గోపాలమిత్రలను నియమించారు. అప్పట్లో రూ.6500 లు వేతనం ఇచ్చేవారు. ఇప్పటికీ అంతే వేతనం ఇస్తున్నారు. క్రమబద్ధీకరణ హామీని తుంగలో తొక్కిన గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా గోపాలమిత్రల మనుగడనే ప్రశ్నార్థకం చేసింది. తమ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పశుసంవర్ధక సహాయకులుగా తీసుకోవాలన్ని వేడుకున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో గోపాలమిత్రల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టడం తో ఖాళీగా ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వారిని అనుసంధానం చేశారు.

ఐదు నెలలుగా వేతనం పెండింగ్..!

ఉమ్మడి జిల్లాలో 325 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. వీరికి గత ఐదు నెలలుగా వేతనం పెండింగ్‌లో పెట్టారు. ఉద్యోగం చేరినప్పటి నుంచీ ఏ నెల కూడా సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి, కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోందని గోపాలమిత్రలు వాపోతున్నారు. వేతన బకాయిలు చెల్లించాలని సంబంధిత అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులకు వైద్య సేవలు అందించడంతోపాటు కృత్రిమ గర్భధారణ, పాడి పశువులు, గొర్రెలకు బీమా చేయించడం, సీజనల్ వారిగా వ్యాధుల నివారణకు టీకా వేయడం తదితర పనులు గోపాలమిత్రలు నిర్వహిస్తున్నారు. పశువుల పోషణలో పాడి రైతులకు సూచనలు ఇవ్వడంతోపాటు పశుగ్రాసం పెంపకం ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని పశుసంవర్ధక సహాయకులు చేసే పనులే తామూ చేస్తున్నా తమకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు. పశుసంవర్ధక సహాయకులకు నెలకు రూ.35వేలు వేతనం ఇస్తుంటే తమకు కేవలం రూ.6500లు ఇస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగ భద్రతలేకపోగా.. కనీస వేతనాలు ఇవ్వక పోవడంపై వారు ఆందోళన చెందుతున్నారు. తమకు కేటాయించిన విధులకు సంబంధించి కచ్చితమైన ప్రొసీడింగ్స్ ఉండాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సమాన పనికిసమాన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

వైసీపీ పాలనలో తీరని అన్యాయం

గత వైపీపీ పాలనలో గోపాల మిత్రలకు తీరని అన్యాయం జరిగింది. గత టీడీపీ పాలనలో గోపాలమిత్రలకు కృత్రిమ గర్భదారణ చేసినందుకు ఇన్సెంటివ్ ఇచ్చేవారు. ఒక్కొక్కరు నెలకు దాదాపు రూ.1500 నుంచి రూ.2వేలు ఇన్సెంటివ్ తీసుకునేవారు. సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణించిన గోపాల మిత్రుల కుటుంబాలకు రూ.లక్ష పరిహారం అందించేవారు. వైసీపీ పాలనలో వీటిని ఆపేశారు. యువగళం పాదయాత్రలో గోపాలమిత్రల సమస్యలు పరిష్కరిస్తామని నారాలోకేశ్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గోపాలమిత్రల సంఘం నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను మరోసారి కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు. అయినా నేటికీ తమ వేదన తీరలేదని వారు పేర్కొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



గోపాల మిత్రలకు సమాన పనికి సమాన వేతనం అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 25 సంవత్సరాలుగా నామమాత్రపు వేతనంతో పల్లెల్లో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నాం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి దాకా నెలకు రూ.6500లు వేతనమే చెల్లిస్తున్నారు. గత ఐదు నెలలుగా పెండింగ్‌లోని వేతనాన్ని తక్షణమే చెల్లించాలి. మంత్రి ఇచ్చిన హామి మేరకు మాకు న్యాయం చేయాలి.

-వెంకటేశులు, గోపాల మిత్రల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలి. వైసీపీ ప్రభుత్వంలో నిలిపేసిన ఇన్‌సెంటివ్‌లు, ఎక్స్‌గ్రేషియా తదితర సదుపాయాలను పునరుద్ధరించాలి. వైసీపీ పాలనలో మరణించిన గోపాలమిత్రలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. ఆయా బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

-వైకుంఠవాసులు, గోపాల మిత్రల సంఘం జిల్లా కార్యదర్శి

డ్రిప్ పరికరాలను సక్రమంగా బిగించాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను నిబంధనల మేరకు రైతుల పొలాల్లో బిగించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక అనంతపురం ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల నిర్వహణపై ఫీల్డ్ కోఆర్డినేటర్లు, ఎంఐ ఇంజనీర్లు, జిల్లా కోఆర్డినేటర్లకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పొలాల్లో ప్రాథమిక పరిశీలన నుంచి అన్ని రకాల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తగిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేసే విషయాన్ని ఆయా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, ఎంఐఏఓలు, ఎంఐ ఇంజనీర్లు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు 551 ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్

కడప మారుతీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కడప జోన్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం 551 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడపలోని తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేసి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆ మేరకు కడప జోన్ పరిధిలోని తిరుపతి డిపో నుంచి 10 బస్సులు, చిత్తూరు 20, అన్నమయ్య 56, కడప జిల్లా నుంచి 60, కర్నూలు 110, నంద్యాల జిల్లా నుంచి 127, అనంతపురం నుంచి 66, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 102 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బస్సుల కండిషన్‌ను మరింత మెరుగుపరిచి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిద్ధం చేశామన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవిప్రసాద్



మంత్రి పయ్యావుల కేశవ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్ ఎన్నికయ్యారు. జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గురువారం ఆ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జడ్పీ సీఈఓ శివశంకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాప్తాడు ఎంపీడీఓ విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీగా గుత్తి ఎంపీడీఓ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య, కోశాధికారిగా బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయ్ భాస్కర్, రాష్ట్ర ప్రతినిధిగా అనంతపురం రూరల్ ఎంపీడీఓ దివాకర్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మీనరసింహ, మమతాదేవి, కుళ్లాయిస్వామి, వీరరాజు, ధనంజయ, విజయ భాస్కర్, తేజోత్స్న ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

విద్యాశాఖలో వలంటీర్లు..!

- నియామకం దిశగా అడుగులు
- టీచర్ల సర్దుబాటుకు విముఖత
- రాష్ట్రశాఖ ప్రతిపాదనలు.. విద్యాశాఖ జాబితా సిద్ధం

అనంతపురం విద్య, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (వలంటీర్ల) నియామకానికి అడుగులు పడుతున్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నచోట వారిని నియమించుకునే దిశగా రాష్ట్ర అధికారులు చర్యలు చేపడుతున్నారు. మిగులు టీచర్ల సర్దుబాటుకు విముఖత చూపుతున్నారను. మెగా డీఎస్సీ నిర్వహించినా ఇంకా పలు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. సబ్జెక్టు టీచర్‌లేని పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో పాఠాలు చెప్పేవారే లేరు. దీంతో బోధన కుంటుపడుతోంది. పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య మేరకు మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలనుకున్నారు. ఇలా చేస్తే రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతాయనుకున్నారో.. ఏమోగానీ అధికారులు ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. అవసరం ఉన్న పాఠశాలలకు ఎడ్యుకేషన్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (వలంటీర్ల)ను తాత్కాలికంగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు జిల్లాలో ఎంతమంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్న వివరాలను పంపాలని విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందాయి. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఐటీ సెల్ సిబ్బందితో సమాచారం సేకరించి, రాష్ట్ర శాఖకు రెండురోజుల క్రితం పంపారు. దాదాపు అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో 500కిపైగా సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్లు లెక్కలు తీసి పంపినట్లు చెబుతున్నారు. ఎన్ని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అవకాశం కల్పిస్తారేనన్నది రాష్ట్ర శాఖ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని విద్యాశాఖ చెబుతోంది. బీఈడీ ఉన్నవారినే తీసుకుంటారా, డీఎడ్ వారికీ అవకాశం ఇస్తారా అనేదానిపై స్పష్టత లేదు. దీంతో కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి దొరకనుంది. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఎంపికపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

రాష్ట్రశాఖ నిర్ణయం మేరకే నియామకాలు

టీచర్ల కొరత ఉన్నచోట మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తారనుకున్నాం. టీచర్ల సర్దుబాటు లేదని తెలుస్తోంది. బోధన కుంటుపడకుండా అవసరం ఉన్న స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వివరాలను రాష్ట్రశాఖకు పంపాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఇక్కడ నియామకాలు చేపడతాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

సీనియార్టీ జాబితా ప్రకటించాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల కు సీనియార్టీ జాబితా ప్రకటించి, పదోన్నతులు కల్పించాలని ఆ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు కోరారు. స్థానిక రామ్‌నగర్‌లో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, చంద్ర, చిన్నారప్ప, శివశంకర్, రామకృష్ణ, కిశోర్, విమల, నారాయణస్వామి, నాగరాజు, కృష్ణమూర్తి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న దగ్గుపాటి మణిహాస్

అనంతపురం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆస్ట్రేలియాలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కుమారుడు దగ్గుపాటి మణిహాస్ ఘనస్వాగతం పలికారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ మెల్‌బోర్న్‌లోని మెల్‌బోర్న్ యూనివర్సిటీలో కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడే కెమికల్ ఇంజనీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న మణిహాస్.. మంత్రికి స్వాగతం పలికారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. మణిహాస్ తనను పరిచయం చేసుకోగానే... మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. చదువు, వాతావరణంపై ఆరాతీశారు. బాగా చదువుకుని రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మంత్రి సూచించారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం మీరు పడుతున్న తపన గురించి ఆస్ట్రేలియాలోని తెలుగువారే కాకుండా ఇక్కడి ప్రముఖులు కూడా చర్చించుకుంటున్నారని, మీరే స్ఫూర్తి' అంటూ మంత్రి వద్ద మణిహాస్ ప్రస్తావించారు. దీంతో బాగా చదువుకోవాలంటూ ఆయన మణిహాస్‌కు విషెస్ తెలిపారని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత బస్సు... ఆరోగ్యమస్తు..!

(5వ పేజీ తరువాయి)

సరిహద్దు మండలాల మహిళలు సర్వజన వైద్యశాలకే వస్తున్నారు. దీంతో మహిళా ఓపీ పెరిగింది. అవసరమైన వారిని అడ్మిషన్ చేసుకుని, వైద్యసేవలు అందిస్తున్నామనీ, కడుపునొప్పి, గర్భసంచి, చెవి, కళ్ల వంటి ఆపరేషన్లు చేస్తున్నామని వైద్యవర్గాలు వివరిస్తున్నాయి.

పెరిగిన శాతం...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిత్యం రెండువేల నుంచి మూడువేల వరకు ఓపీ నమోదవుతోంది. సాధారణంగా ఎక్కువశాతం పురుషులే ఆస్పత్రికి వస్తారు. ఉచిత బస్సు పథకం ప్రారంభం నుంచి ఓపీ గణాంకాల్లో మార్పులు వచ్చాయి. పురుషుల కంటే మహిళా ఓపీ పెరిగింది. జనరల్ మెడిసిన్, గైనిక్, సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాలమిక్ ఓపీలకు మహిళలు ఎక్కువగా వస్తున్నారు. గత నెలలో ఏకంగా 38,982 మంది మహిళలు ఓపీ చూపించుకోవడం ఇందుకు నిదర్శనమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.



గైనిక్ ఓపీలో మహిళలు

మహిళల సంఖ్య పెరిగింది



కంటి విభాగంలో మహిళల ఓపీ సంఖ్య పెరుగుతూ వస్తోంది. పలు మండలాల నుంచి మహిళలు తరలివస్తున్నారు. వారికి ఉచిత బస్సు ప్రయాణం వరమనే చెప్పాలి. ఓపీకి వచ్చిన మహిళలకు పరీక్షలుచేసి అవసరమైన ఐడ్రాప్స్, మెడిసిన్ ఇస్తున్నాం. చూపు మందగించిన వారికి కళ్లద్దాలను సూచిస్తున్నాం. తప్పనిసరి అయినవారికి అడ్మిషన్ చేసుకుని, ఆపరేషన్ చేస్తున్నాం. నేత్ర సమస్యలు చాలా సున్నితమైనవి. వీలైనంత తొందరగా పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం చేయించుకుంటే సమస్య నుంచి బయటపడవచ్చు.

-డాక్టర్ కస్తూరిబాయి, కంటి విభాగాధిపతి, సర్వజనాస్పత్రి

సద్వినియోగం అవుతోంది



రోజుకు 300మందికిపైగా మహిళా ఓపీ నమోదవుతోంది. వారిలో అత్యధికంగా గ్రామీణ, మండల ప్రాంత మహిళలే ఉంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు సద్వినియోగం అవుతుందనే చెప్పాలి. ఓపికి వచ్చిన వారిని అవసరమైతే రక్తపరీక్షలు, స్కానింగ్‌కు సిఫార్సు చేస్తున్నాం. సాధారణ జబ్బుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులుగా రూపాంతరం చెందకుండా తగిన సమయంలోనే చికిత్సలు పొందేందుకు దోహదపడుతోంది.

-డాక్టర్ మాధవి, జనరల్ మెడిసిన్ విభాగం

వీడిన వైసీపీ గ్రహణం

- పీఏబీఆర్ కుడి కాలువకు మరమ్మతులు
- శరవేగంగా పనులు... అన్నదాతల హర్షం



రాప్తాడు మండలం యర్రగుంట సమీపంలో మరమ్మతుల అనంతరం కాలువ, రోడ్డు

రాప్తాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు ఆరేళ్లగా వైసీపీ గ్రహణం పట్టింది. కాలువ మరమ్మతులకు పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో కాలువలో కంపచెట్లు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయి నీరు ముందుకు కదిలే పరిస్థితి ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం కాలువ మరమ్మతులు చేపట్టింది. కాలువతోపాటు అనుబంధంగా ఉండే రోడ్డు మరమ్మతులకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు పూర్తి కావచ్చాయి. ఆరేళ్ల తరువాత కాలువకు మరమ్మతులు చేపడుతుండడంతో వైసీపీ గ్రహణం వీడిందన్న చర్చలు వినిపిస్తున్నాయి. కాలువ మరమ్మతులతో చివరి ఆయకట్టుకు కూడా నీరు చేరనుంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా కూడేరు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు, కనగానపల్లి బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని 49 చెరువులకు నీరు సరఫరా అవుతాయి. త్వరలోనే నీటిని వదలనున్నట్లు కుడి కాలువ ధర్మవరం ఏఈ శ్రీనివాసులు తెలిపారు.


చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 17 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

దొంగల సవాల్..!

ఒక కేసు ఛేదించకముందే మరో నేరం

- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు
- నామమాత్రంగా పోలీసుల గస్తీ
- నియంత్రణకు తగినంత సిబ్బంది కరువు



కేశవరెడ్డి పాఠశాలలో చోరీ చేస్తున్న దొంగలు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా దొంగల బెడద ఎక్కువైంది. కాలేజీలు, ఆలయాలు, ఇళ్లు, వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, విద్యుత్ వైర్లు, డ్రిప్ వైర్లు, చివరికి పశువులను కూడా వదలడం లేదు. పోలీసులు ఒక కేసును ఛేదించకముందే మరో చోరీ చేస్తూ సవాల్ విసురుతున్నారు. సిబ్బంది కొరతతో నేరాలను నియంత్రించడం కష్టంగా మారిందని పోలీసులు చెబుతున్నారు. ఉన్నవారితో కనీసం గస్తీ కూడా నిర్వహించడం లేదని స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మచ్చుకు కొన్ని...

ఈనెల 2న బుక్కరాయసముద్రం పరిధిలోని దక్షిణామూర్తినగర్‌లో రెండు ఇళ్లలో వరుస చోరీలు జరిగాయి. రూ.లక్షల విలువైన బంగారం ఆ భరణాలు చోరీ అయ్యాయి.

- ఈ నెల 5న వడియంపేట గ్రామంలో నాలుగు కార్పొరేట్ కళాశాలల్లో చోరీ జరిగింది. దాదాపు రూ. 4 లక్షలు ఎత్తికెళ్లారు.
- ఈ నెల 7న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఆటో వెళ్తుండగా ఇద్దరు మహిళా దొంగలు మాటల్లో పెట్టి ఆమె నుంచి రూ. 4లక్ష విలువైన బంగారు చైను కాజేశారు.
- గత నెల 13న బుక్కరాయసముద్రంలో రాత్రిపూట మద్యం దుకాణంలో చొరబడి రూ.20వేలు, మద్యం ఎత్తికెళ్లారు.
- ఆగస్టు 6న బుక్కరాయసముద్రంలో గౌరవయ్యసేను కొట్టాలలో ఆరు తులాల బంగారం, రూ.3.3లక్షల నగుదు చోరీ చేశారు. అయితే ఈ ఘటనలో పోయిన సొమ్మును రికవరీ చేశారు.
- జూలై 21 స్థానిక మునలమ్మకట్ట వద్ద ఉన్న మునలమ్మ ఆలయంలో హుండీలో ఉన్న రూ.2లక్షలు చోరీ చేశారు. ఈ ఘటనలో దొంగలు ఆచూకీ తెలియలేదు. గత నెలలో దొంగతనం చేసిన డబ్బును తిరిగి ఆలయంలో పడేసి వెళ్లారు.
- మండలంలో పసులూరు గ్రామం వద్ద వెళ్లే రహదారిలో మే 3న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి నారాయణస్వామి అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి వెళ్తుండగా అతని నుంచి రూ.6.80లక్షలను దోపిడీ చేశారు.



బీరువాలో నగదును ఎత్తుకెళ్లిన దొంగలు

జనాభాకి అనుగుణంగా... పోలీసు ఏదీ?

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం మండలంలో దాదాపు 75 వేల జనాభా ఉంది. వీటితో పాటు జాతీయ రహదారి, అమరావతి హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. సెంట్రల్ యూనివర్సిటీ, జిల్లాజైలు, ఓపెన్ ఎయిర్‌జైలు, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, పశు పరిశోధన కేంద్రం, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఫ్యాక్షన్ గ్రామాలు ఏ గ్రేడ్ స్థాయిలో 3 గ్రామ పంచాయతీలు, బీ గ్రేడ్ సమస్యత్మాక గ్రామ పంచాయతీలు 4, అక్రమ రవాణా, ఇసుక, ఎర్ర మట్టి వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ప్రస్తుతం స్టేషన్‌లో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు ఉండగా అందులో ఒక ఏఎస్‌ఐ డీఎస్పీ కార్యాలయం అటాచ్‌లో ఉన్నారు. ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఒకరు మెడికల్ లీవ్‌లో, మరొకరు హైవే పెట్రోలింగ్‌కు వెళ్లారు. 18 మంది కానిస్టేబుళ్లు ఉండగా కోర్టు డ్యూటీ 2, స్పెషల్ పార్టీకి 1, స్టేషన్‌లో కంప్యూటర్ వర్క్ 2, రైటర్లు 3 ఉన్నారు. మిగిలిన పది మంది సిబ్బంది మండలం అంతా పర్య వేక్షించాలంటే చాలా కష్టంగా ఉంది. స్టేషన్ అప్‌గ్రేడ్ అయినా నిబంధనల మేరకు ఉండాల్సినంత మంది సిబ్బంది లేరు. దీంతో సిబ్బందికి లీవ్ దొరకాలన్నా కూడా కష్టంగా మారింది.



బీకేఎస్‌లో ఇటీవల మద్యం దుకాణంలో చోరీపై విచారిస్తున్న పోలీసులు

కట్టడి చేస్తాం



బుక్కరాయసముద్రం మండలం విస్తీర్ణంలో చాలా పెద్దది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది నేర నియంత్రణకు సరిపోవడం లేదు. సిబ్బందిని పెంచి దొంగతనాలు జరగకుండా నియంత్రిస్తాం. బ్లూకోల్ట్స్‌కు నలుగురిని కేటాయిస్తాం. ప్రస్తుతం జరిగిన చోరీలపై ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే నేరస్తులను పట్టుకుంటాం. గ్రామాల్లో ఇంటికి తాళాలు వేసి వెళ్లే సమయాల్లో పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. అలాగే విలువైన వస్తువులు, బంగారం ఇంట్లో పెట్టకుండా భద్రత ఉండే ప్రదేశాల్లో పెట్టాలి.

-వెంకటేశులు, రూరల్ డీఎస్పీ

క్రైం కార్నర్

మగ్గానికి వేలాడిన నేతన్న


నీలూరి రాజేశ్ (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుల మగ్గానికి మరో నేతన్న వేలాడాడు. స్థానిక చంద్రబాబునగర్‌లో చేనేత కార్మికుడు నీలూరి రాజేశ్(30) అప్పుల బాధ భరించలేక గురువారం మగ్గానికి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రబాబునగర్‌కు చెందిన రాజేశ్ కూలిమగ్గం నేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర దక్కక కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక గురువారం సాయంత్రం ఇంట్లో మగ్గానికే చీరతో ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లిన భార్య గంగరత్నమ్మ ఇంటికి వచ్చి తలుపులు తీయడానికి ప్రయత్నించగా.. రాలేదు. అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి, లోపలికి వెళ్లగా ఉరికి వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. గంగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. రాజేశ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి హత్య

తాడిపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డు అభిరుచి హోటల్ సమీపంలో గురువారం తెల్లవారుజామున రాజు (52) అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు హత్య చేసినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రాజు పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉండేది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లలేదన్నారు. ఏం జరిగిందో తెలియదు గానీ తెల్లవారుజామున హత్యకు గురయ్యాడన్నారు. మృతదేహాన్ని పరిశీలించగా రాళ్లతో దాడి చేసి చంపినట్లు గుర్తించామన్నారు. భార్య ఉత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ఉరవకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోమ్ పేరుతో పలువురు నిరుద్యోగులను మోసగించిన విషయం ఉరవకొండలో వెలుగు చూసింది. ఓ కంపెనీ వ్యాట్సాప్ ద్వారా వర్క్ ఫ్రం హోమ్‌తో శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని మెసేజ్‌లు పంపారు. నెలకు రూ.15 నుంచి రూ.30వేల వరకూ సంపాదించవచ్చని ఆశ చూపారు. సంప్రదించిన కొందరు నిరుద్యోగులకు ఉద్యోగం కావాలంటే ఫోన్ పే చేయాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన కొందరు నిరుద్యోగులు రూ.6 వేలు, రూ.12వేలు ఫోన్ పే చేశారు. ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో ఇలా 50 మందిదాకా డబ్బులు చెల్లించారు. ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని నమ్మించారు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేయడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మోసపోయిన బాధితులు వివరాలను వెల్లడించడానికి నిరాకరిస్తున్నారు.

పెళ్లి పేరిట వంచన

- గర్భందాల్చి.. ప్రసవించిన బాలిక

యాడికి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ బాలికను గర్భవతిని చేసిన రాజ అనే వ్యక్తిపై యాడికి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. యాపీఎస్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు, నిందితుడు కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణవాసి. బాధిత బాలిక యాడికి మండలంలోని ఓ గ్రామంలో పదో తరగతి వరకు చదివింది. ఆ తరువాత చదువు మానేసి కర్నూలు జిల్లా మద్దికెరలోని తన నాన్నమ్మ ఇంట్లో ఉండేది. మద్దికెరకు ఒక వివాహంలో పాల్గొనేందుకు వచ్చిన రాజ.. బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దసరా పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చిన బాలిక, ఈ విషయం గురించి తెలియజేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే గర్భందాల్చిన బాలిక, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక గురువారం తెల్లవారుజామున ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక తల్లిదండ్రులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లి విచారించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంరక్షణ కార్యదర్శి స్టేషన్‌కు వెళ్లారు. బాలిక అనంతపురంలో ప్రసవించినందున, అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు వారికి సూచించారు. దీంతో వారు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

వ్యక్తిని కాపాడిన రైల్వే పోలీసులు


సాయినాయక్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసు

తాడిపత్రి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన సాయినాయక్‌ను రైల్వే పోలీసులు శివారెడ్డి, వరప్రసాద్ రక్షించారు. వారు తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు చెందిన సాయినాయక్ ఇంటిలో గొడవ పడి, మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. ఈక్రమంలో రైలుకింద పడి చనిపోవాలని తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఓ గూడ్సు రైలు వస్తుండగా ఎదురు వెళ్లాడు. దీన్ని గమనించిన రైల్వే పోలీసులు అప్రమత్తమై అతడిని కాపాడారు. తర్వాత అతన్ని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత అతడి కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు.

వివరాల నమోదులో నిర్లక్ష్యం తగదు: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాల నమోదులో నిర్లక్ష్యం తగదని డీపీఓ నాగరాజునాయుడు.. సిబ్బందికి సూచించారు. స్థానిక డీపీఓ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వాహణపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేసేలా చూడాలన్నారు. ఐవీఆర్ఎస్ ప్రణాళిక ప్రకారం అమలయ్యేలా చూడాలన్నారు. ప్రజాఫిర్యాదులన్నింటినీ పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్లు ఉషారాణి, భారతి, జూనియర్ అసిస్టెంట్లు ఉషశ్రీ, శాలిని, సాయి పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే కందిలో అధిక దిగుబడులు

- పుట్టపర్తి ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య

ధర్మవరం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కందిపంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పుట్టపర్తి ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య రైతులకు సూచించారు. మండలంలోని చిగిచెర్ల గ్రామసమీపంలో కందిపొలాలను ఏడీఏ లక్ష్మానాయక్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కంది సాకీయదశ పూత, కాయ అభివృద్ధి దశలో ఉన్నట్లు వెల్లడించారు. జూన్, జూలై మాసంలో విత్తన సాగు చేసిన పంట మొగ్గదశ నుంచి కాయదశకు చేరుకుందని, ఈ సమయంలో వేపనూనె 5.0మిల్లీమీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కందికి తెగుళ్లు వ్యాపిస్తే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి సకాలంలో మందులు పిచికారి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, గ్రామరైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


కందిపంటలో జాగ్రత్తలపై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు


మాట్లాడుతున్న ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు.

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్ విభాగంలో పలు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు ఆదేశించారు. పీఆర్ఎస్ఈ కార్యాలయంలో గురువారం ఆయన జిల్లాలోని డీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా అనుమతులు పొందిన పనులకు సంబంధించి ప్రాంతాల వారిగా డీఈలతో సమీక్ష నిర్వహించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పూర్తి చేయడానికి అనుమతులు వచ్చాయన్నారు. ఇలాంటివి జిల్లాలో 67 ఉన్నట్లు వెల్లడించారు. వీటిని నేషనల్ హెల్త్ మిషన్ పథకం ద్వారా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం ద్వారా ప్రతి భవన నిర్మాణానికి రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా 38 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించడానికి అనుమతులు వచ్చినట్లు తెలిపారు. పీఎం ఏబీహెచ్ఐఎమ్ కింద మంజూరైన 24 క్లినిక్‌ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులను గడువులోపు పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డీఈలు లక్ష్మీనారాయణ, క్రిష్ణజ్యోతి, రాజన్న, సుధాకర్‌నాయక్, యల్లమనాయుడు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి కనిపించాలి: పంచాయతీరాజ్‌లోని పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపడుతున్న పనుల్లో పురోగతి కనిపించాలని ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు.. ఇంజనీర్లను ఆదేశించారు. స్థానిక పీఆర్ సర్కిల్ కార్యాలయంలో పీఐయూ సిబ్బందితో గురువారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశారు. ఆ విభాగంలో చేపడుతున్న పనులపై సమీక్ష చేశారు. పీఎంజీఎస్ఆర్ కింద 16 పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసి, అనుమతుల కోసం పంపామని ఎస్ఈ తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ శ్రీరాములు, డీఈలు నారాయణస్వామి, రాజేశ్వరరెడ్డి, డీఎల్ మురళి పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.17, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 975 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో గురువారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 25న ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వివరాలకు 6304426349, 8096763970 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెగా సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో ఈ ఏడాది మే, జూన్‌లో నిర్వహించిన యూజీ మెగా సప్లిమెంటరీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. వీసీ ప్రొఫెసర్ అనిత ఫలితాలను విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయన్నారు. రీవాల్యుయేషన్, వ్యక్తిగత వెరిఫికేషన్ కోసం నవంబరు 8వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మునినారాయణప్ప, ప్రొఫెసర్ శోభలత, డా.లక్ష్మయ్య, స్మిత, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వెంకటరమణ, పరీక్షల కంట్రోలర్ శ్రీరామ్ నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యామద్దల సచివాలయ సర్వేయర్ సస్పెన్షన్

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని న్యామద్దల సచివాలయం-1లో సర్వేయర్‌గా పనిచేస్తున్న హేమంత్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ బాలకృష్ణుడు గురువారం తెలిపారు. ఈనెల సామాజిక పింఛన్ల సొమ్ము రూ.39 వేలు సర్వేయర్ తిరిగి వెనక్కి ఇవ్వకుండా, సమాచారం కూడా ఇవ్వకుండా విధులకు గైర్హాజరయ్యారన్నారు. దీనిపై అతడికి నోటీసు జారీ చేశామన్నారు. గ్రామంలో రీసర్వే విధులకు సర్వేయర్ సక్రమంగా హాజరు కావడంలేదన్నారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతుండటంతో సంబంధిత జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు. ఆ మేరకు సర్వేయర్ హేమంత్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ విజయశాంతిబాయి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

26న ఆర్చరీ జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ సబ్‌జూనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 26న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. 2008 జనవరి 1లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9949279330ను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు సైన్స్ ప్రాజెక్టులపై సదస్సులు

అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): సైన్స్ టీమ్స్ వివరాలు, సైన్స్ ప్రాజెక్టుల నమోదు, ప్రాజెక్టుల ఎంపికపై అవగాహన కల్పించడం కోసం శుక్ర, శనివారాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ సెంటర్ అధికారి బాలమురళి గురువారం ఓప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ బిల్డ్ థాన్- 2025 కార్య క్రమానికి విద్యార్థుల నుంచి నూతన ఆలోచనలు, శాస్త్రీయపరిష్కారాల ఆవిష్కరణకు సంబంధించి ఈసదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు. శుక్రవారం ఉదయం గుంతకల్లు, మధ్యాహ్నం కళ్యాణదుర్గం డివిజన్‌లకు, శనివారం ఉదయం అనంతపురం డివిజన్, మధ్యాహ్నం అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ఈసదస్సులు కొనసాగుతాయన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాల నుంచి ఒక సైన్స్ టీచర్, ఒకవిద్యార్థి తప్పనిసరిగా హాజరయ్యేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.

దరఖాస్తు చేసుకోండి

బుక్కపట్నం/అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం డైట్ కళాశాలలో డెప్యుటేషన్‌పై బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అనంతపురం డీఈఓ డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 31వ తేదీ నాటికి గరిష్ఠంగా 58 ఏళ్ల వయసు, స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల బోధనానుభవం, సబ్జెక్టులో పీజీ, ఎంఈడీలో 55 శాతం మార్కులతో పాసై, ఇంగ్లిష్, కంప్యూటర్ ప్రావీణ్యం ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబరు 5 నుంచి 8వతేదీ వరకు రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత దరఖాస్తు, విద్యార్హత పత్రాలను డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందించాలన్నారు. బుక్కపట్నం డైట్‌లో ఖాళీల వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామని డీఈఓ తెలిపారు.

రద్దీ నియంత్రణకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి (06557) ప్రత్యేక రైలు ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06558) 24న నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. బెంగళూరు-బరైనీ (06247) ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06248)ను 26న నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, డోన్, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, సట్నా, ప్రయాగరాజ్ చౌకీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బక్సర్, అర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

నేడు ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐఏబీ(ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశం శుక్రవారం జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఐఏబీ సమావేశానికి ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

ఆదాయ వనరులను పెంచుకోండి

- జడ్పీ సీఈఓ శివశంకర్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంచుకోవాలని జడ్పీ సీఈఓ శివశంకర్ పేర్కొన్నారు. జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంపొందించుకోవడంపై ఉమ్మడి జిల్లా ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషాలు హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ శిక్షణలో నేర్చుకున్న అంశాలను, క్షేత్రస్థాయిలో అమలు చేసి, అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. డ్వామా పీడీ సలీం బాషా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే మెటీరియల్ కాంపౌండ్ పనులకు తప్పనిసరిగా టెండర్ ప్రాసెస్‌ను అనుసరించాలన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 31 గ్రామాల్లో వాటర్ హార్వేస్టింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. అందుకు అనుగుణంగానే క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం మీద నిర్వహించే టెలీకాన్ఫరెన్స్‌కు అందరూ హాజరు కావాలన్నారు. తద్వారా సమాచార లోపం తలెత్తె అవకాశం ఉండద న్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీడీఓ నాగశివలీలా, ట్రైనర్ సౌజన్య, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శివశంకర్

బీఎస్ఎన్ఎల్ బొనాంజా ఆఫర్లు

- నవంబరు 18 వరకూ అవకాశం
- పీజీఎం ముజీబ్ పాషా

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్.. వినియోగదారులకు బొనాంజా ఆఫర్లను ప్రవేశపెట్టిందని ఆ సంస్థ పీజీఎం ముజీబ్ పాషా గురువారం ప్రకటనలో తెలిపారు. దీపావళి బొనాంజా, కార్పొరేట్ కాంబో, గిఫ్ట్ రీచార్జ్, సీనియర్ సిటిజన్ ప్లాన్, సెలెక్టెడ్ ప్లాన్లపై 5 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. ప్రస్తుత వినియోగదారులతోపాటు కొత్తవారికి కూడా ఈ ఆఫర్లు వర్తిస్తాయన్నారు. దీపావళి బొనాంజా ఆఫర్‌లో రూపాయికే 30 రోజులపాటు అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, రోజూ 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు వర్తిస్తాయన్నారు. సిమ్ కార్డు ఉచితంగా ఇస్తారన్నారు. ఈ ఆఫర్ నవంబరు 15 వరకూ అమల్లో ఉంటుందన్నారు. కార్పొరేట్ కాంబో ఆఫర్‌లో భాగంగా ఏదేని కార్పొరేట్ సంస్థ పది, అంత కంటే ఎక్కువ పోస్టు పెయిడ్, ఒక ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్ తీసుకుంటే మొదటి నెల రీచార్జిపై 10 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. ఈ ఆఫర్ నవంబరు 18 వరకూ అమల్లో ఉంటుందన్నారు. గిఫ్ట్ రీచార్జి ఆఫర్ నవంబరు 18 వరకూ బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా మిత్రులకు, కుటుంబసభ్యులకు రీచార్జి చేస్తే ఆ మొత్తంలో 25 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్ ప్లాన్‌లో 1,812 రూపాయలకే 365 రోజుల అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, రోజూ 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు వర్తిస్తాయన్నారు. సిమ్ కార్డు ఉచితంగా ఇస్తామన్నారు. ఆరు నెలలపాటు బీఐ టీవీ సబ్‌స్క్రిప్షన్ ఇస్తామన్నారు. ఈ ఆఫర్ 60 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. నవంబరు 18 వరకూ అమల్లో ఉంటుందన్నారు. సెలెక్టెడ్ ప్లాన్లపై 5 శాతం డిస్కౌంట్ ఆఫర్‌లో రూ.485, రూ.1999పై నవంబరు 18వ తేదీ వరకూ బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా రీచార్జి చేస్తే రీచార్జి అమౌంట్‌లో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు.


విత్తనం వేస్తున్న రైతులు

8 గంటల్లో 20 ఎకరాల్లో విత్తనం

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి తన ఎద్దులతో ఏకంగా 8 గంటల వ్యవధిలో 20 ఎకరాల్లో అలసంద విత్తి, శెభాష్ అనిపించుకున్నాడు. గ్రామానికి చెందిన చెన్నబసయ్యకు చెందిన పొలంలో గురువారం విత్తనం వేశాడు. తెల్లవారుజామున 5 గంటలకు కాడెద్దులతో విత్తు పని ప్రారంభించిన ఆయన మధ్యాహ్నం ఒంటి గంటకు 20 ఎకరాల్లో పూర్తి చేశాడు.

బీటీపీకి వరదనీరు


బీటీపీలో చేరిన వరదనీరు

రాయదుర్గం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భైరవాన్ తిప్ప ప్రాజెక్టులోకి కర్ణాటక నుంచి వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో శుక్రవారం క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా ఇప్పటికే 1.57 టీఎంసీలు చేరాయి. ఎగువన కర్ణాటకలోని వాణివిలాస్ సాగర్ నిండిపోవడంతో అక్కడి నుంచి రెండువేల క్యూసెక్కులకుపైగా నీటిని అవుట్‌ఫ్లో చేస్తున్నారు. దీంతో ఆ నీరంతా బీటీపీకి చేరే అవకాశం ఉంది. ఇన్‌ఫ్లో పెరిగి, నీటిని దిగువకు విడుదల చేయనున్న నేపథ్యంలో దిగువన నదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలకు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేశారు.

ఏపీ జట్టు ఫిట్‌నెస్ కోచ్‌గా బొమ్మన్న



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 మహిళా క్రికెట్ జట్టు ఫిట్‌నెస్ కోచ్‌గా జిల్లాకు చెందిన బొమ్మన్న నియమితుడయ్యారు. మహారాష్ట్రలో ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించే బీసీసీఐ అండర్-19 మహిళా జాతీయ క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్న రాష్ట్ర జట్టుకు బొమ్మన్న ఫిట్‌నెస్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన బొమ్మన్న రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమితుడవడం పట్ల జిల్లా క్రికెట్ వర్గాలు అభినందనలు తెలిపాయి.

రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో డీవీఈఓ వెంకటరమణ నాయక్, కార్యదర్శి శ్రీనివాసులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 నేషనల్ రెజ్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబరు 1 నుంచి హరియాణాలోని పానిపట్‌లో జరిగే ఎస్‌జీఎఫ్-19 జాతీయ రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన బాలురలో శాంతు, రాజేష్, శ్రీనాథ్, నందీష్, గణేష్ ఉన్నారు. బాలికల్లో రాణి, స్పందన, అరుణ ఎంపికయ్యారు. ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులను డీవీఈఓ వెంకట రమణనాయక్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, శాప్ కోచ్ రాఘవేంద్ర, మహాలక్ష్మి, సాయి పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు


పోస్టర్లు విడుదల చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 42వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 25, 26 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ శాంతరాజ్ తెలిపారు. కర్నూలులోని రాయలసీమ రీజియన్ డీఐజీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రామాంజి, తులసి వెంకటేష్, రాజేష్, రామ్మోహన్‌రెడ్డి, బిలాల్ పాల్గొన్నారు.

ఆర్వోబీపై వాహనాల రాకపోకలను

20 రోజుల్లో ప్రారంభిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత వెల్లడి ● పనుల పరిశీలన



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)పై మరో 20 రోజుల్లో వాహనాల రాకపోకలు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత వెల్లడించారు. ఆ బ్రిడ్జి పనులను ఆమె నేషనల్‌హైవే అధికారులు, కాంట్రాక్టర్లు, టీడీపీ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. పనులు ఎంతవరకు వచ్చాయి. బ్రిడ్జిని ఎప్పటిలోగా ప్రారంభిస్తారని అధికారులనడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ బ్రిడ్జి మంజూరైందన్నారు. దీనికి రూ.74 కోట్ల నిధులు విడుదలైనట్లు తెలిపారు. పాత కాంట్రాక్టర్ రూ. 49 కోట్ల వరకూ పనులు చేశారన్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చాక బ్రిడ్జి నిర్మాణ పనులను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి తిరిగి పనులు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 2026 మే నెలలోగా పనులు మొత్తంగా పూర్తవుతాయన్నారు. మరో 20 రోజుల్లో ఆర్వోబీపై వాహనాల రాకపోకలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, మరూరు సొసైటీ చైర్మన్ గోపాల్, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కిష్టా, నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాళ్లు

అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జోన్‌లోని అన్ని బ్రాంచ్‌లకు చెందిన శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు క్యాట్ పోటీ పరీక్షలలో సత్తాచాటారు. గత సెప్టెంబరులో మొదటి లెవల్ క్యాట్ పోటీపరీక్షలు జరిగాయి. ఇందులో మ్యాథ్స్‌లో 708మంది, ఫిజిక్స్‌లో446 మంది, కెమెస్ట్రీలో 754మంది ప్రతిభ చూపి రెండో లెవల్ పోటీపరీక్షలకు అర్హత సాధించారు. ఇందుకుగాను వారికి గురువారం నగరంలోని కమ్మ భవన్‌సమీపంలో ఉన్న 6వ బ్రాంచ్‌లపాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, టీచర్లు పాల్గొన్నారు.

మరిన్ని మెరుగైన సేవలందించాలి

అనంతపురం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గొర్రెల పెంపకందారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేలా చూడాలని పశుసంవర్థక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ సూచించారు. స్థానిక పశుసంవర్థక శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సమాఖ్య మహాజన సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రేమ్‌చంద్ హాజరై మాట్లాడారు. ఎన్‌సీడీసీ రుణాలు తీసుకున్న సంఘం సభ్యులు సకాలంలో కంతులు చెల్లించాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు గొర్రెల పెంపకం దారులకు అందించేలా సంఘం సభ్యులు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల అభివృద్ధి విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీలక్ష్మీ, పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి ఎడ్యుఐకాన్ అవార్డు



విశాఖ ఎంపీ భరత్‌చేత అవార్డు అందుకుంటున్న సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీషిర్డీ సాయి మోక్షిత్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ సుబ్బారెడ్డికి ఎడ్యుఐకాన్ అవార్డు దక్కింది. విద్యారంగంలో వివిధ అంశాలపై కృషి చేసినందుకుగాను ఆయన్ను స్కూల్ ఆఫ్‌వండర్ కిడ్స్, నిషా, అపుస్మా, ట్రస్మాతో కలిసి మల్లబ్యూరో ఆఫ్‌చైల్డ్ ఎడ్యుకేషన్‌డెవలప్‌మెంట్ అందించే ఎడ్యుఐకాన్ అవార్డుకు ఎంపిక చేశారు. గురువారం విశాఖపట్నంలో హోటల్ ఫెయిర్‌ఫీల్డ్ మ్యారియట్‌లో జరిగిన సదస్సులో ఎంపీ భరత్ చేతుల మీదుగా సుబ్బారెడ్డి అవార్డును అందుకున్నారు.

నగరం.. జలమయం

● భారీవర్షానికి రోడ్లపై, వీధుల్లో పెద్దఎత్తున చేరిన నీరు
● లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు తప్పని తిప్పలు
● అసిస్టెంట్ కలెక్టర్, ఏఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంత నగరం జలమయమైంది. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అన్ని ప్రాంతాల్లోని రోడ్లల్లో, వీధుల్లో పెద్దఎత్తున నీరు చేరాయి.. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. హనుమాన్‌కాలనీ, రజకనగర్, గౌరవ గార్డెన్, జనశక్తి నగర్, రంగస్వామి నగర్, శాంతినగర్, గంగానగర్, బిందెలకాలనీ, ఉ మానగర్ మరువవంకబ్రిడ్జి, నడిమివంకలలో పర్యటించారు. స్థానికులతో మాట్లా డి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరువవంకలో ప్లాస్టిక్ వస్తువులు, చెత్త చేరడం తో ఉమానగర్ బ్రిడ్జి వద్ద ఎక్సవేటర్లతో తొలగించారు. ఇక ప్రధాన రహదారు లు, వీధులు వర్షం నీటితో మడుగుల్లా మారాయి. దీంతో నగరవాసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారుల వెంట ఏఎంసీ ఈఈలు చంద్రశేఖర్, షాకీర్, ఎంహెచ్‌ఓ నరసింహులు, డీఈ సత్యనారాయణ, ఏఈలు ఉన్నారు.



గౌరవ్ గార్డెన్స్‌లో స్థానికులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్, ఏఎంసీ కమిషనర్



వర్షం నీటితో నిండిన జనశక్తినగర్‌లోని ఎంజీఎం కాలనీ



కొత్తూరు అమ్మవారి శాల వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



రామ్‌నగర్‌లో జలయమైన రోడ్లు

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ

అనంతపురం రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట పంచాయతీ పరిధిలో గల తారా మస్జిద్ ప్రాంతంలో ఉన్న స్థలానికి సంబంధించి పరిటాల కుటుంబం డబ్బులు తీసుకున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇటీవల ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ అన్నారు. పాపంపేటలో గురువారం ఆయన మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, శ్రీసత్యసాయి జిల్లా కుమ్మరసాధికార సమితి కన్వీనర్ రామాంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు గోవిందు, సాంబ శివ, పేరంహరి, రాము తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ భూమి సమస్యను పరిష్కరించేందుకు పరిటాల కుటుంబం కృషి చేస్తోందన్నారు. సంబంధిత భూమి యజమానుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు కూడా జమ చేయించారన్నారు. అలాంటి వారిపై తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. ఆయన లేనిపోనివి చెప్పి ప్రజల్లో భయాందోళనలు రేపే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఫైనల్‌కు ఎస్ఎస్‌బీఎన్, ఎస్ఎల్ఎన్ జట్లు



కబడ్డీ పోటీలకు హాజరైన జట్ల సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్, ఎస్ఎల్ఎన్ కళాశాలల జట్లు ఫైనల్‌కు చేరాయి. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ పోటీలు గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఎస్కే యూనివర్శిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ పోటీలను ప్రారంభించారు. మొత్తం పది జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. సెమీఫైనల్స్‌లో ఆర్ట్స్ కళాశాలపై ఎస్ఎల్ఎన్ డిగ్రీ కాలేజీ, ఎస్ఎస్‌జీఎస్ కళాశాలపై ఎస్ఎస్‌బీఎన్ జట్లు గెలుపొంది ఫైనల్స్‌కు చేరాయి. కార్యక్రమంలో పీడీలు శ్రీరామ్, శత్రుజ్ఞ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర సమీపంలోని వెంకటంపల్లి రోడ్డులో గురువారం కర్ణాటకకు తరలిస్తున్న 90క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. అనంతపురం నుంచి రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్టు పక్కా సమాచారం వచ్చిందన్నారు. దీంతో సిబ్బందితో కలిసి కాపు కాచి బియ్యం తరలిస్తున్న ఐషర్ వాహనాన్ని పట్టుకున్నామన్నారు. వెంటనే స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు. సివిల్‌సప్లై ప్రకారం 6ఏ కింద డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అనంతపురం, మేడాపురం గ్రామాలలో రేషన్ కార్డుదారుల నుంచి పలువురు బియ్యాన్ని సేకరించి డంప్ చేసుకుని రహస్యంగా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తహసీల్దార్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు పీవీకేకే విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని ఆలమూరు రోడ్డులో గల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సురత్ సింహ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇందుకు అతన్ని కళాశాలలో గురువారం విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తదితరులు అభినందించారు. అనంతరం ఆ విద్యార్థి మాట్లాడుతూ.. ఈ నెల 21వతేదీన నంద్యాల శాంతిరాం ఫార్మసీ కళాశాలలో జేఎన్‌టీయూఏ ఇంటర్ కాలేజీయేట్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచానని తెలిపారు. దీంతో నవంబరు 1 నుంచి 12వ తేదీవరకు పంజాబ్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరగబోయే ఆల్ ఇండియా యూనివర్సిటీల ఫెన్సింగ్ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూఏ తరఫున పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అవనిజ, ఫిజికల్ డైరెక్టర్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన

అనంతపురం విద్య, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థి తప్పిపోయినా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన నగరంలోని మాస్టర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు తప్పిపోయిన విద్యార్థి తల్లిదండ్రులను ఆర్ఐఓ ఆఫీస్ వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. కాలేజీలోంచి విదార్థి బుధవారం వెళ్లిపోయాడని, అయినా యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని వాపోయారు. అలాగే గురువారం తల్లిదండ్రులు కళాశాలకు వస్తే కనీసం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఆకాలేజీపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ ఎదుట పట్టుబడ్డారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ హామీఇవ్వగా ఆందోళన విరమించారు. నాయకులు మంజునాథ్, ఉమామహేష్, సాయి, సన్నీ, రాజు, సంతోష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతల స్వీకరణ

రామగిరి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలో నలుగురు పంచాయతీ కార్యదర్శులు గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలానికి కొన్ని రోజులుగా పంచాయతీ కార్యదర్శులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఐదుగురు రాగా.. ఇందులో ,నలుగురు బాధ్యతలు చేపట్టారు. పోలేపల్లి పంచాయతీకి భాస్కర్, ఎంసీపల్లికి వెంకటరమణ, కుంటిమద్దికి చంద్రకాంత్, మాదాపురానికి జగదీశ్ మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగావతి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.

త్రీటౌన్ సీఐగా రాజేంద్రనాథ్ యాదవ్

అనంతపురం క్రైం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అనంతపురం త్రీటౌన్ సీఐగా రాజేంద్రనాద్ యాదవ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఇదివరకు సీఐగా ఉన్న శాంతిలాల్‌ను వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన రాజేంద్రనాథ్ యాదవ్‌ను పలువురు పోలీసు ఉన్నతాధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అయితే అనూహ్యంగా శాంతిలాల్‌ను మార్చడం, రాజేంనాథ్ సైతం అంతే వేగంగా బాధ్యతలు తీసుకోవడం గమనార్హం.

ధ్యానమండలి ఆశ్రమంలో అన్నదానం

నార్పల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ గాండ్ల వరి కుంట్ల వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం నార్పలలోని సత్యసాయి ధ్యానమండలి ఆశ్రమంలో గురువారం ఆయన కుటుంబసభ్యులు అన్నదానం చేపట్టారు. తొలుత స్థానిక ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. తర్వాత ఆశ్రమంలో చిన్నారులకు నూతన వస్త్రాలను అందజేసి, అన్నదానం చేపట్టారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన

శింగనమల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సలకంచెరువు,నిదనవాడ తరిమెల,కల్లుమడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను, చెత్తతో సంపద తయారీ కేంద్రాలను జిల్లాపరిషత్ సీఈఓ శివశంకర్‌ప్రసాద్ గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌కుమార్,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్న పరిశీలన



గార్లదిన్నె సమీపంలో తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి స్పందన

గార్లదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి మొక్కజొన్న పంట తడిసి రైతులు ఇబ్బంది పడుతుండడంపై గురువారం ఆంధ్రజ్యోతిలో రైతులకు ముసురు భయం.. జడివానకు తడిసిన మొక్కజొన్న అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన వ్యవసాయ అధికారి సోమశేఖర్, సిబ్బంది వెంటనే గార్లదిన్నె, కనుంపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అదేవిధంగా కోసిన మొక్కజొన్నను పరిశీలించారు. ఈ సం దర్భంగా అధికారి మాట్లాడుతూ... రానున్న ఐదురోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉందని, మొక్కజొన్న ఇతర పంటలను ఎవరూ కోయరాదని సూచించారు. పంట కోసిన రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, వీహెచ్ఏ అమరేష్, వీఏఏలు నరేష్ పాల్గొన్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

గార్లదిన్నె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్లలో ఎర్రిస్వామి అనే రైతు ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు గురువా రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, రేణుక దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రోజూ మాదిరిగానే గత బుధవారం ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడి బీరువాలోని రూ. 34వేలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేశాడని, విచారణ చేసి చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకుంటామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు.

నార్పల సొసైటీ చైర్మన్‌గా మహేష్‌నాయుడు



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో మహేష్‌నాయుడు

నార్పల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నార్పల సింగిల్ విండో చైర్మన్‌గా సుల్తాన్ పేటకు చెందిన మహేష్‌నాయుడును నియమించినట్లు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఈసందర్భంగా మహేష్ నాయుడు మాట్లాడుతూ టీడీపీని నమ్ముకుని పార్టీ అభివృద్ధికి పాటుపడ్డామని, ఇప్పుడు తన సేవలకు తగిన గుర్తింపు లభించిందని తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి, ఏడీసీసీబీ చైర్మన్ ముంటి మడుగు కేశవ రెడ్డికి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి రైతుకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇంటింటా చెత్తసేకరణ పరిశీలన

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి చెత్తసేకరణను నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి గురువారం పరిశీలించారు. 66, 44, 52 వార్డులలో పర్యటించి పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరణను సక్రమంగా చేపడుతున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. టవర్‌క్లాక్, కమలానగర్, కోర్టురోడ్డు, రామ్‌నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు, కార్మికులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. తర్వాత బళ్ళారిరోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ తనిఖీ చేశారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగుల ఆర్థిక సాయం

అనంతపురంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మినిమమ్ స్కేల్ ఉద్యోగిగా పనిచేస్తున్న సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్య చికిత్సల నిమిత్తం వర్సిటీలోని నాన్ టీచింగ్ ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. అందరూ కలిసి రూ.40,400జమ చేసి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనితకు గురువారం అందజేశారు. తద్వారా ఉద్యోగి కుటుంబానికి పంపిణీ చేయించారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ సభ్యుడి మృతి



పెద్దప్పయ్య (ఫైల్)

కనగానపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు పెద్దప్పయ్య(80) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. గ్రామానికి చెందిన పెద్దప్పయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఇంటిలోనే మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారని, పరిటాల రవీంద్రకు అత్యంత సన్నిహితుడని బంధువులు తెలిపారు. ఆయన మృతిపట్ల టీడీపీ నాయకులు తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు.

కలెక్టర్ అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమృత్‌సర్‌లో నవంబరు 1వతేదీ నుంచి జరిగే ఆల్ ఇండియా నేషనల్ యూనివర్శిటీ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిలో బాలికల్లో... జ్యోష్ణవిబాయి, బసంతి, దీక్షిత, బాలురలో ప్రణవ్, నరసింహ, జస్వంత్, హర్విందర్ ఎంపికయ్యారు. వీరిని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ఆనంద్ అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి జిల్లా కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు. డీఎస్‌డీఓ మంజుల, కోచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజావ్యతిరేక విధానాలు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ప్రజా ఉద్యమంపై రూపొందించిన పోస్టర్‌ను పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఈనెల 28న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఆర్డీఓలు, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. అనంతపురం అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా అక్రమాలు, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయని పేర్కొన్నారు.

సుబ్బరాయసాగర్‌కు జలకళ

హెచ్చెల్సీ నీటి విడుదల .. రైతుల హర్షం

పుట్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ రిజర్వాయర్‌కు పది రోజుల నుంచి హెచ్చెల్సీ నీరు చేరుతోంది. దీంతో ఇప్పటికే భూగర్భజలాలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ కింద 22 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 0.480 టీఎంసీలు. ఇప్పటికే రిజర్వాయర్‌లో 309.150 మీటర్ల మేర నీరు చేరింది. నీరు గరిష్ఠ స్థాయి 317 మీటర్లకు చేరితే.. దిగువకు విడుదల చేస్తారు. దీంతో పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు తాగునీటి కోసం వాటిని మళ్లిస్తారు. వీటితో పాటు 29వ డిస్ట్రిబ్యూటర్ కింద సాగుచేస్తున్న నాలుగు వేల ఎకరాలకు నీటిని విడుదల చేస్తారు. వీటికి ఇటీవలే సుబ్బరాయసాగర్ నుంచి 29వ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా బొప్పేపల్లి చెరువుకు నీటి విడుదలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రభుత్వంతో జీఓ తెచ్చిన విషయం తెలిసిందే.



సుబ్బరాయసాగర్‌కు చేరిన హెచ్చెల్సీ నీరు

రెండు పంటలు వేస్తాం



సుబ్బరాయసాగర్ రిజర్వాయర్‌లోకి నీరు వస్తే కింద ఉన్న కడవకల్లు, సంజీవపురం, ఓబులాపురం, దోసలేడు, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తాయి. దీంతో ఏడాదికి రెండు వాణిజ్య పంటలను సాగుచేయవచ్చు.

-లింగమూర్తి, రైతు, కడవకల్లు

అరటిపంటకు మేలు

సాగర్‌లోకి హెచ్చెల్సీ నీరు నిల్వచేస్తే వేసవికాలంలో కూడా బోర్లలో నీరు సమృద్ధిగా ఉంటుంది. అరటిపంటకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. అధికారులు స్పందించి కనీసం ఏడాదిలో ఒకనెల డ్యామ్‌లో నీటిని నిల్వ ఉంచితే పండ్లతోటల రైతులకు ఇబ్బందులు ఉండవు.

-నాగేశ్వరరెడ్డి, రైతు, కడవకల్లు



విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

తాడిపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని శ్మశానవాటికలో 30 అడుగుల శివుని విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. రాజమండ్రికి చెందిన శిల్పకళా నిపుణులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నామని జేసీపీఆర్ తెలిపారు. అలాగే శ్మశానవాటికలో గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు రుద్రభూమికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యాలూ లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి ఉన్నారు.

మీ మాటే ముఖ్యం

తాడిపత్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి మీ మాటే ముఖ్యం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు తెలిపారు.



వరిపంటను పరిశీలిస్తున్న విప్ కాలవ

ఇది రైతు ప్రభుత్వం: విప్

కణేకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, సకాలంలో పంటలకు నీరందించిన ఘనత తమ పార్టీకే దక్కిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని గంగలాపురం వద్ద వరి పంట ను పరిశీలించిన ఆయన మాట్లాడారు. హెచ్చెల్సీ ద్వారా కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించి.. రైతులను ఆదుకున్నామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కళేకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, బసవరాజు, వన్నారెడ్డి, ప్రభాకర్, చంద్రశేఖర్‌గుప్తా, చాంద్ బాషా, అనిల్, కురుబ నాగరాజు ఉన్నారు.

● నకిలీ మద్యం నివారణకు కృషి: కూటమి ప్రభుత్వం సురక్ష యాప్ ద్వారా పూర్తిస్థాయిలో నకిలీ మద్యాన్ని నివారించడానికి చర్యలు తీసుకుందని విప్ అన్నారు. కణేకల్లులోని నర్మద వైన్స్‌లో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఉమాబాయి, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రతినిధులు

విడపనకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి వైసీపీ నాయకులైన సభ్యులు చాలామంది హాజరు కాలేదు. 17 పంచాయతీలకు చెందిన 17 మంది సర్పంచ్‌లు, 14 మంది ఎంపీటీసీలకు గాను కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీతో కలిపి నలుగురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరు అయ్యారు. మండల సమావేశాన్ని ఆ ఏడుగురితోనే మ.. మ.. అనిపించారు.

రోడ్లపై మురుగు



సిద్దరాంపురంలో ఇంటి ముందు నిల్వ ఉన్న మురుగు

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని సిద్ధరాంపురంలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరు ఇలా రోడ్లపైనే నిల్వ ఉంటోంది. కొన్ని చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. ఇక వర్షం పడితే వీధులు మొత్తం మురుగే. ఇలా నెలల తరబడి మురుగు నిల్వ ఉండటంతో ఆ గ్రామస్థులు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దోమలూ అధికమయ్యాయి. ఏదైనా వాహనం వెళ్లినప్పుడు.. మురుగునీరు ఇళ్లల్లో చిట్లుతోంది. ఆ మురుగు వల్ల పాచిపట్టడంతో బైక్‌దారి జారి పడి.. గాయ పడుతున్నారు. పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

పట్టించుకోరా..?

● రాయలచెరువులో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
● లారీల్లో పంట తరలించేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు

యాడికి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులోని కొత్త ఇళ్లకాలనీలో అరటి తోటలకు వెళ్లే మార్గంలో కరెంట్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. రైతులు అరటి పంటను లారీల్లో తరలించేటప్పుడు ఎక్కడ ఆ తీగలు తగిలి ఘోర ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆ కరెంట్ తీగలు తగిలి అరటికాయలు కొట్టడానికి వచ్చిన ఒక కూలీ మరణించాడని, సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. వారు ఏ మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



లారీలకు తగిలేంత తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

నిశ్చితార్థ వేడుకలో మంత్రి



వేడుకలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కుమారుడు వంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ రామలక్ష్మి మనుమరాలు స్నేహలత వివాహ నిశ్చితార్థ కార్యక్రమాన్ని స్థానిక వాసవి కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొని వారిని ఆశీర్వదించారు. కాగా, అనంతపురం నుంచి బెళుగుప్పకు వస్తూ మార్గమధ్యలోని శీర్పి చెరువుకు నీరువెళ్లే కాలువను మంత్రి పరిశీలించారు. చెరువుకు జీడిపల్లి రిజర్వాయరు నుంచి నీరు విడుదల చేయించాలని వెంకటాద్రిపల్లి, శీర్పి రైతులు మంత్రిని కోరారు. ఇప్పటికే హంద్రీనీవా అధికారులను నీటిని వదలాలని ఆదేశించడం జరిగిందని మంత్రి తెలిపారు.

● పీఏబీఆర్‌ను పరిశీలించిన మంత్రి
కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ఇరిగేషన్ అధికారులతో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం పరిశీలించారు. డ్యాంలో 5.34 టీఎంసీల నీరు నిల్వ ఉందని మంత్రికి అధికారులు తెలిపారు. డ్యాం కట్ట భాగాన్ని పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్డు కట్ట మధ్య భాగంలో గడ్డి మొలవడంతో వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం కాలువను పరిశీలించారు. మంత్రి వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి ఉన్నారు.

గుంతకల్లు ఆర్డీఓపై లోకాయుక్తలో ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కర్నూలులో గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీబీఎస్ శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేసినట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులను పరిష్కరించకుండా ఆర్డీఓ కాలయాపన చేస్తున్నారని, ఫిర్యాదుదారులు, దళిత సంఘాల ప్రతినిధులను ఆగౌరవంగా మాట్లాడుతున్నారని అన్నారు. అతనిపై చర్యలు తీసుకొని ఫిర్యాదుదారుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రాయల్టీ తగ్గించాలి

తాడిపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లబండల పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రాయల్టీని తగ్గించి ఆదుకోవాలని సీఐటీయూ అ ధ్యక్ష, కార్యదర్శులు ఉమాగౌ డ్, నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యా లయంలో గురువారం వారు మాట్లాడుతూ.. టన్నుకు రూ.222 చొప్పున రాయల్టీ వసూలు చేస్తుండడంతో ట్రాక్టర్ల యజమానులు దిక్కు తోచని స్థితిలో పడ్డారన్నారు. రాయల్టీ చెల్లించి రవాణా చేయాలంటే నష్టాలు తప్పవ న్నారు. పెరిగిన రాయల్టీ కారణంగా తాడిపత్రితో పా టు పరిసర ప్రాంతాల్లో నాప రాళ్ల రవాణా నిలిచిపోయిం దన్నారు. పరిశ్రమపై ఆధార పడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, రాయల్టీని తగ్గించి వారిని ఆదుకోవాలని కోరారు.

గుత్తి ప్రత్యేక సబ్‌జైలు తనిఖీ

గుత్తి,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్యేక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఎం రాజశేఖర్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి వీ సాధుబాబు గురువారం తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశాన్ని నిర్వహించి.. సమస్యలపై ఆరా తీశారు. క్షణికావేశంలో తప్పులు చేయరాదని, సత్ప్రవర్తన మెలగాలని సూచించారు. వారి వెంట జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, లీగల్ ఎయిడ్ న్యాయవాది సూర్యనారాయణ, కోర్టు సిబ్బంది సాధక్‌వలి ఉన్నారు.

ఆధార్ సెంటర్ పునఃప్రారంభం

కుందుర్పి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌లో నెల రోజులుగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎంపీడీఓ మాధవి, ఏఓ లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ ప్రత్యేక చొరవతో ఆధార్ సెంటర్‌ను పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఆధార్ సేవలను గురువారం ఏఓ పునఃప్రారంభించారు.

● సద్వినియోగం చేసుకోండి
శెట్టూరు : స్థానిక జ్ఞానవికాస్ పాఠశాలలో విద్యార్థుల ఆధార్‌కార్డు అప్‌డేషన్ కోసం ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శ్రీధర్ సూచించారు. మండలంలో వారం పాటు ఆధార్ క్యాంపులను వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైతు సంఘం కమిటీ ఎన్నిక

ఉరవకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరులో రైతు సంఘం మహాసభను గురువారం నిర్వహించారు. రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓబులపతి, ప్రధానకార్యదర్శిగా సుధాకర్, సభ్యులుగా చిన్న పెద్దన్న, లక్ష్మయ్య, రంగయ్య, బాషాను ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరుపాక్షి మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. హంద్రీనీవా పిల్ల కాలువలను పూర్తి చేసి, సాగునీరు ఇవ్వాలన్నారు.



రైతు సంఘం నూతన కమిటీ సభ్యులు



జేవీవీ రాష్ట్ర నాయకుడిని సన్మానిస్తున్న సిబ్బంది

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

గుత్తి,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో క్యాంపస్ సీఈఓ శ్రీరాముల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా సాగింది. సీఈఓ, జేవీవీ రాష్ట్ర నాయకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఇస్మాయిల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ఆర్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నకుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంగస్వామి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

యాడికి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 21, 22న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో యాడికి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బీచ్‌వాలీబాల్ అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి మణికంఠ, వాలీబాల్ అండర్-17 విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఉదయ్‌కిరణ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు గురువారం తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రకళ, శివశంకర్, ఉపాధ్యాయుడు రవికుమార్ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

వాలీబాల్ పోటీలకు వరుణ్ కుమార్



బెళుగుప్ప: అనంతపురంలో ఈ నెల 22న నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 17 బాలుర విభాగం పోటీలలో మండలంలోని నరసాపురం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వరుణ్ కుమార్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో ఈస్ట్ గోదావరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు బాలాజీ గురువారం తెలిపారు.

క్రీడాపోటీలు ప్రారంభం

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రతిభ పాఠశాల మైదానంలో అండర్ 14, 17 బాల, బాలికల మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో 250 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, పీఈటీ బోగేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు క్రీడాపోటీలు

పుట్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్ర, శని వారాల్లో స్కూల్‌గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ గురువారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగ, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి బీటీపీ ద్వారా నీరు

బెళుగుప్ప, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీటిని విడుదల చేస్తున్నామని, మండలంలోని శ్రీ రంగాపురం, గుండ్లపల్లి, నరసాపురం, బూదివర్తి గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. శనివారం ఉదయానికి నీరు ఉధృతంగా ప్రవహించే అవకాశాలున్నాయి. కాగా, హగరి నది పరివాహక ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లకూడదని అధికారులు పలు గ్రామాల్లో దండోరా వేయించారు.

పెద్ద కొట్టాలపల్లిలో క్రీడాపోటీలు

విడపనకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొట్టాలపల్లి గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను గురువారం నిర్వహించారు. అండర్ 14 విభాగంలో ఏడు బాలికల జట్లు, ఎనిమిది బాలురు జట్లు, అలాగే అండర్ 17 విభాగంలో ఆరు బాలికల జట్లు, ఎనిమిది బాలురు జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం డీ శేషగిరి, వైస్ ఎంపీపీ సునీతా, సర్పంచ్ రామాంజినేయులు, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● క్రీడాదుస్తుల పంపిణీ : విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామానికి చెందిన విద్యార్థులకు రూ. 25 వేలు విలువ చేసే క్రీడాదుస్తులను అనంతపురానికి చెందిన అనంత సాయి స్పీచ్ హియరింగ్ థెరఫి సెంటర్, ఆడియాలజిలస్టు శేజాల ధనుంజయ గురువారం అందజేశారు. అనంతరం ధనుంజయ్యను హెచ్‌ఎం రాఘవ ప్రసాద్, పీడీ క్రిష్ణా, ఉపాధ్యాయులు సన్మానించారు.



చీకలగురికిలో క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ధనుంజయ

క్రైం న్యూస్..

నకిలీ డాక్యుమెంట్ల కేసులో
వైసీపీ నాయకుడి అరెస్టు

పెద్దవడుగూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూమిని కాజేసేందుకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో మండలంలోని గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పామిరెడ్డి విశ్వనాథరెడ్డిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గుత్తి అనంతపురం గ్రామ సర్వే నంబర్ 317లో 1.35 ఎకరాల మిగులు భూమి పామిరెడ్డి శంకర్ రెడ్డి, పామిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డికి అనువంశికంగా సంక్రమించింది. ఈ భూమికి పామిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి కొడుకు మధుసూదన్‌రెడ్డి నకిలీ డాక్యుమెంట్ తయారు చేసి 2022లో తన పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నాడు. ఆ భూమిపై బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పామిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు యతీష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, మధుసూదన్ రెడ్డిని రెండు రోజుల క్రితం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నకిలీ డాక్యుమెంట్ తయారీ, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వెనుక వైసీపీ నాయకుడు పామిరెడ్డి విశ్వనాథరెడ్డి హస్తం ఉన్నట్లు గుర్తించి, అతన్ని అరెస్టు చేశామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని, జైలుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పామిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లపల్లి శివారులో అటవీప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు. ఆ రేషన్ బియ్యం ప్యాకెట్లను పోలీసు స్టేషన్‌కు తరలించామని, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ కంబక్కకు, రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పుట్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన శ్రీనివాసులు తనను కులం పేరుతో దూషించాడని అదే గ్రామానికి చెందిన రామలక్షుమ్మ అనే దళిత మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా పొదుపు సంఘం లోన్ డబ్బులు డ్రా చేసుకొనే విషయంలో తనను కులం పేరుతో దూషించడమే కాకుండా.. అసభ్య పదజాలంతో తిట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో శ్రీనివాసులుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిధుల స్వాహాకు అధికారుల యత్నం

● వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులకు తెలియకుండా డ్రా
● వాటాల విషయంలో తేడాతో బయటకు పొక్కిన విషయం
● రాత్రికి రాత్రే లబ్ధిదారులకు డబ్బులు చెల్లించిన వైనం

విడపనకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులకు చెల్లించాల్సిన నిధులను అధికారులు స్వాహా చేసేందుకు యత్నించారు. విషయం బయటకు పొక్కడంతో ఆ డబ్బులను రాత్రికి రాత్రే లబ్ధిదారులకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే .. మండలంలోని ఏడు గ్రామాల్లో ఐహెచ్‌హెచ్‌ఎల్ కింద వ్యక్తి గత మరుగుదొడ్లను 2014-18లో నాటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి కాని మరుగుదొడ్లకు అప్పట్లో బిల్లులు పెండింగ్ పెట్టారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ బిల్లుల గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడు గ్రామాల్లోని 20 మంది లబ్ధిదారులకు రూ. 45,280 మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని హౌసింగ్ అధికారులు, ఉపాధి అధికారులు కలిసి స్వాహా చేయడానికి యత్నించారు. విడపనకలుకు చెందిన సింగాడి వీరేష్ అనే వ్యక్తి అకౌంట్‌కు ఆ మొత్తాన్ని వేసి .. ఈ నెల ఒకటో తేదీన డ్రా చేసుకున్నట్లు సమాచారం. అయితే ఆ డబ్బును లబ్ధిదారులకు ఇవ్వకుండా వారి వద్దే ఉంచుకున్నారు. కానీ వాటాలు పంచుకునే విషయంలో అధికారుల మధ్య తేడా రావటంతో విషయం బయటకు పొక్కి లబ్ధిదారులకు తెల్సింది. దీంతో రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రే లబ్ధిదారులకు డబ్బులు చెల్లించి రసీదులు తీసుకున్నారు. ఆ రసీదుల్లో లబ్ధిదారుల సంతకాలు కూడా తీసుకున్నారు. కానీ ఎక్కడా రసీదుల్లో తేదీని మాత్రం వేయలేదు. దీనిపై హౌసింగ్ ఏఈ శేఖర్‌ను వివరణ కోరగా... 'డబ్బులు డ్రా చేసిన మరుసటి రోజే లబ్ధిదారులకు పంపిణీ చేశాం. ఎవ్వరి వద్ద వారం రోజులు డబ్బులు పెట్టుకోలేదు. మా వద్దకు వచ్చి ఏ లబ్ధిదారుడు వచ్చి బిల్లు ఇవ్వండి అని అడగలేదు, లబ్ధిదారులకు నగదు ఇచ్చి రసీదులు తీసుకునే సమయంలో తేదీ వేయటం మరచిపోయాం. ఇప్పుడు తేదీలు వేస్తాం.' అని తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి: ఎమ్మెల్యే



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మురికినీరు నిల్వ లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వార్డుల్లో పర్యటిస్తూ.. సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● సీఎంఆర్‌ఎఫ్ అందజేత : నియోజకవర్గంలోని 92 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.54,61,355 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే తన నివాసంలో గురువారం వారికి అందజేశారు.

కల్వర్టు ధ్వంసం

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు హరేసముద్రం, కురువళ్లి గ్రామాల మధ్య ఉన్న చిన్నపాటి కల్వర్టు ధ్వంసమైంది. ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ రైతులు పంటపోలాలకు ఎద్దుల బండి ఇతర వాహనాల్లో వెళ్తుంటారు. ప్రజలు కూడా కురువళ్లి, బొల్లనగుడ్డం, చంద్రగిరి, హరేసముద్రం గ్రామాలకు ఈ మార్గం ద్వారానే వెళ్లేంది. ఈ కల్వర్టు ధ్వంసం కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి.. రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ధ్వంసమైన కల్వర్టు